
# మళ్ళీ అదే కథ




మరి కొన్ని గంటల్లో నరకంనించి బయటపడబోతున్నందుకు ఆనందమూర్తికి సంతోషంగా వుంది. ఇంకెన్ని? మహా ఐతే రెండు గంటలు. అనుకున్నాడతను.

'మైగాడ్ తను ఎన్ని రోజులీ నరకంలో వున్నాడు? ఒకటి కాదు- రెండుకాదు నలభైమూడు రోజులు. రియల్లీ హెల్. అతని ఒళ్లు జలదరించింది.

జన్రల్ హాస్పిటల్లో ట్రీట్‌మెంటంటే హెల్ కాక మరేమిటి?

ఓమారు తన చుట్టూరా బెడ్‌లమీద వున్న పేషంట్లకేసి చూశాడు అతను.

పూర్ ఫెలోస్. వీళ్లింకా ఎన్నాళ్లీ నరకంలో పడికొట్టుకు చావాలో?

రెండ్రోజుల క్రితం ఉదయంపూట రవుండ్స్‌కు వచ్చినప్పుడు డాక్టర్ అమర్‌నాథ్ అన్న మాటలను అతను ఓసారి గుర్తుకు తెచ్చుకున్నాడు.

ఒక్కో పేషంట్‌నే చూస్తూ వస్తున్నాడాయన. తన దగ్గర కొచ్చాడు.

"గుడ్‌మాణింగ్ డాక్టర్..."

"గుడ్‌మార్నింగ్. ఎలా వుంది?"

"ఓ.కే సార్. ఐయామ్ ఆల్‌రైట్"

"బయట పడటానికి తాపత్రయ పడుతున్నట్టున్నారు"

నవ్వేడు తను...

"ఇంకొంచెం వీక్‌గా కనిపిస్తున్నారు. మరో రెండ్రోజులు వుండండి. తర్వాత డిశ్చార్జి చేస్తాను"

తల వూపాడతను.

రెండ్రోజులు రెండు యుగాల్లా గడిచాయి. ఎప్పుడు విముక్తి?

ఎదురు చూసిన సమయం దగ్గర పడింది. నిజంగా తను ఇంత త్వరగా బతికి బయట పడతాడనుకోలేదు. తనకు వచ్చిన జబ్బు అలాంటిది? నిజంగా అంత ప్రమాదకరమయినదని డాక్టరు చెప్పేవరకూ తనూ గ్రహించలేక పోయాడు... తర్వాత వణికిపోయాడు.

"డోంట్ వర్రీ... భయపడకండి" భుజం తడుతూ అన్నాడు డాక్టర్. ఐనా తనని భయంవదల్లేదు.

ఆపరేషన్ అవసరమట. ఎలాంటి ఆపరేషన్? మైనర్ ఆపరేషన్ ఐవుండదు. మేజర్ ఆపరేషన్, అవును తను అనుకున్నట్టు పెద్ద ఆపరేషనే జరిగింది.

ఎలాగో చావునించి తప్పించుకున్నాడు.

తను తప్పించుకున్నాడా?

రాజేశ్వరి తప్పించిందా?

తను ఎడ్మిట్ అయిన మరు రోజు దీపాలు వెలిగాక తలనొప్పిగా వుండి బెడ్ మీద కళ్లు మూసుకునిపడుకుని వుంటే "ఓమారు ఇలా తిరగండి. టెంపరేచర్ చూడాలి" అని వినిపించిన మాటలతో తలతిప్పి చూసిన అతనికి వీపు మీద ఎవరో చెయిన్‌తో కొట్టినట్టనిపించింది.

ఇది నిజమా?

ఎదురుగా రాజేశ్వరి!!

తెల్లని దుస్తులలో నర్సు యూనిఫాంలో, దేవతలా మెరిసిపోతూ నిల్చున్న రాజేశ్వరి!

రాజేశ్వరికీ షాకే...

రెండు నిమిషాలు అలాగే నిలబడి పోయింది. తర్వాత తేరుకుంది.

"టెంపరేచర్ చూడాలి" గొణుగుతున్నట్లుగా అన్నది.

నోరు తెరిచాడతను.

కళ్లు ఆమెనే చూస్తున్నాయి.

చూసింది.

కేస్ షీట్ మీద టెంపరేచర్ నోట్ చేసి వెళ్ళిపోయింది. మరో రోగి దగ్గరకు.

అతను ఆమెనే చూస్తున్నాడు...

రాజేశ్వరి ఈ వృత్తిలోకి ఎందుకు ప్రవేశించింది?

మళ్ళీ రాజేశ్వరిని తను ఇలా కలుసుకోవాల్సి వస్తుందని అనుకోలేదు.... ఆల్మోస్ట్ తను రాజేశ్వరిని మర్చిపోయాడు. కావాలనే మరిచిపోయాడు...

మళ్ళీ ఈరోజు ఇలా తన ముందు...

తను రాజేశ్వరికి చేసిన ద్రోహం భూతంలా కళ్ళముందు కదలాడింది...

ఇప్పుడు తన మీద పగతీర్చుకోవడానికి రాజేశ్వరికి మంచి అవకాశం... ఐతే రాజేశ్వరి తన మీద కసి తీర్చుకుంటుందా?

ఓగాడ్... సేవ్ మీ ఫ్రమ్ రాజేశ్వరీ... వణికిపోయాడతను.. అక్కడినుండి ఆ హాస్పిటల్‌ని వదిలి వీలయినంత దూరం పరుగు దీయాలనుకున్నాడు...

నిద్రపట్టలేదు...

పన్నెండు గంటలు దాటుతోంది... రోగులందరూ నిద్రపోతున్నారు...

ఎక్కడో దూరంగా వార్డులోనించి ఎవరో పేషెంట్ బాధతో మూల్గుతున్నాడు. పై అంతస్థులో ఏదో బండిని లాక్కెళుతున్న చప్పుడు అంతకు మించి అంతటా నిశ్శబ్దం...

ట్యూబ్‌లైట్ కిందిగా కుర్చీలో కూర్చుని న్యూటెస్టమెంట్ చదువుకుంటోంది రాజేశ్వరి...

అతను బెడ్‌మీద పడుకోలేకపోయాడు.

మెల్లగా లేచి నిల్చున్నాడు... దిండు కింది నించి సిగరెట్ పాక్, అగ్గిపెట్టి తీసుకుని వరండాలోకి వచ్చాడు... వరండాలో అక్కడా అక్కడా ముసుగులు పెట్టి నిద్రపోతున్నారు ఎవరో...

ఓ పిల్లర్ దగ్గర నిలబడి సిగరెట్ ముట్టించాడు...

హాస్పిటల్ ఆవరణలో ఎత్తుగా పెరిగిన చెట్లు చిరుగాలికి తలలు వూపుతున్నాయి...

చంద్రుడు ప్రకాశిస్తున్నాడు... వెన్నెల వెలుగు అంతటా పరుచుకుంది...

'రాజేశ్వరి ఏమాలోచిస్తోంది?' సిగరెట్ పొగను బయటకు వదులుతూ ఆలోచిస్తున్నాడు అతను...

ఇంతలో ఎవరిదో మెత్తని అడుగుల సవ్వడి....

వెనక్కు తిరిగి చూసిన అతనికి రాజేశ్వరి కనిపించింది...

కలవర పడ్డాడతను...

"సిగరెట్టు కాల్చకూడదు" చాలా మామూలుగా అన్నదామె...

"రాజేశ్వరీ"

"నన్ను ఇక్కడి రోగులందరూ సిస్టర్ అని పిలుస్తారు"

అతని ముఖానికి ఆకుపచ్చరంగు పూసినట్లనిపించింది...

సిగరెట్‌ని దూరంగా విసిరేశాడు...

"వచ్చి నిద్రపోండి"

"రావడం లేదు" తనలో తను అనుకుంటున్నట్లు అన్నాడు...

"ఓ టాబ్లెట్ ఇస్తాను రండి" ముందుకు కదులుతూ అన్నది...

"నిద్ర వచ్చేవరకు ఇక్కడ నిల్చుంటాను" అప్పుడే వెళ్ళి పడుకోవడం అతనికి ఇష్టం లేదు...

"ఇది హాస్పిటల్... కొన్ని నియమాలను మీకు ఇష్టం లేకపోయినా పాటించవలసి వుంటుంది" ముందుకు కదలి వెళ్ళిపోయింది.

రాజేశ్వరి వెనుకే నడిచాడతను మంత్ర ముగ్ధుడిలా...

ఓ టాబ్లెట్ ఇచ్చిందతనికి... వేసుకున్నాడు... ఆ తర్వాత కొంచెం సేపటికి అతనికి నిద్ర వచ్చింది. ఆలోచిస్తూనే నిద్రలోకి జారుకున్నాడు...

తర్వాత నిద్రపోతున్న అతని దగ్గరకు వచ్చి చాలాసేపు రాజేశ్వరి నిల్చున్న విషయం అతనికి తెలీదు...

'ఒకప్పటి తన జీవితానికి పరమార్థం... అక్కడ నిలవలేక పోయింది రాజేశ్వరి...

గబగబా నడిచి డ్యూటీ రూమ్‌లోకి వెళ్ళింది...

ఆమెకు కన్నీళ్లు వరదలా పొంగి వచ్చాయి.

గుండెలు పగిలేలా ఏడ్చింది...

భగవాన్? మళ్లీ రంపపుకోత...

తన జీవితం నుంచి తప్పుకున్నాడనుకున్న మనిషి తిరిగి ఈరోజు ప్రత్యక్షమయ్యాడు...

తన గుండెలో మంటలను రేపుతున్నాడు.

ముందు జీవితం గురించి మధురమయిన కలలు కనే రోజుల్లో... వయసు పొంగు ఏవయిపుకు లాక్కెళితే అవయిపుకు పరుగులు తీసే రోజుల్లో వెన్నెల గీతలా తన జీవితంలో ప్రవేశించి తనలో ఆశలు రేపి– తన వయసును కొల్లగొట్టి– తన ప్రతిరూపాన్ని తనలో వదిలి ఓరాత్రికి రాత్రి ఎక్కడికో పారిపోయిన పిరికివాడు. ఒకప్పటి తన ప్రియుడు. ఈరోజు తన ముందు గిల్టీగా ఫీలవుతూ తనకళ్ళలోకి చూట్టానికే భయపడుతున్నాడు...

అప్పట్లో అతను కనిపిస్తే ఎక్కడైనా గొంతు నులిమి చంపుదామనుకొంది... ఆ తర్వాత తనూ చద్దామనుకుంది... కాని ఏదీ జరగలేదు..

డాక్టర్ మేరీ తనకు తటస్థపడకుండా వున్నట్లయితే తను ఎప్పుడో చచ్చిపోయేది. ఈరోజు ఈ హాస్పిటల్లో నర్స్‌గా ఇతని ఎదుట పడేది కాదు... డాక్టర్ మేరీ తనకు జీవితం మీద ఆశను కలిగించింది. ఓ దారి చూపించింది. అందుకే తాను బతికింది...

ఆమరురోజు రాత్రికూడా అంతే... ఆనందమూర్తికి నిద్ర పట్టలేదు... ఐతే రాజేశ్వరి అతనికి టాబ్లెట్ ఇస్తానని అనలేదు...

కొంచెం సేపు– రోగులందరూ నిద్ర పోయాక ఓల్డ్ టెస్ట్‌మెంట్ చదువుకుని ఆ తర్వాత వెళ్ళి వరండాలో చంద్రుడికేసి చూస్తూ నిలబడింది...

కొంచెం సేపయిన తర్వాత అతను ఆమె వెనుగ్గా నిలబడ్డాడు... రాజేశ్వరిని పలకరించాలని ఎంతగానో ప్రయత్నించాడు. కాని అతని నోరు పెగల్లేదు...

చివరకు ఎలాగో "రాజేశ్వరీ" అన్నాడు.

"మీరా!"

"నన్ను క్షమించు రాజేశ్వరీ" బాధగా అన్నాడతను...

ఆమె మాట్లాడలేదు.

తర్వాత అతనే మళ్ళీ అన్నాడు "నేను పిరికివాణ్ణి"

"ఏమయితేనేం? ఎప్పుడో నాజీవితం కాలిపోయింది... గతాన్ని తవ్వకండి... బతకలేను" అర్థిస్తున్నట్లుగా అన్నది...

ఎవరో పేషంట్ దగ్గుతున్నాడు... గబగబా లోపలకు వెళ్ళింది... ఐదు నిమిషాల తర్వాత బయటకు వచ్చి మవునంగా నిలబడింది...

"నీకు తీరని ద్రోహం చేశాను" నంగిగా అన్నాడు...

"మీరుచేసిందేముంది? ఆదేవుడు చేశాడు"

"అలా అనకు రాజేశ్వరీ... నేనొక నీచుడిని... ఆక్షణంలో నేను నాగురించే ఆలోచించాను.. స్వార్థపరుడిని..."

ఆమె మవునం వదల్లేదు... వింటూంది.... అతను వుండుండి ఏదో గుర్తు చేసుకుని చెపుతున్నవాడిలా మాట్లాడుతున్నాడు.

"పాపా? బాబా?"

"ఏమిటీ?"

"నేను నిన్ను వదిలి వెళ్ళిపోయేటప్పుడు నువ్వు కడుపుతో వున్నావు కదూ?"

"బాబు"

"ఎక్కడున్నాడు?" ఆత్రంగా అడిగాడు.

"నాదగ్గరే" మెల్లగా అన్నది రాజేశ్వరి.

"నువ్వు పెళ్ళి చేసుకోలేదూ?"

"లేదు"

"రాజేశ్వరీ!" బాధగా వూగిపోతూ అన్నాడతను...

అతను పశ్చాత్తాప పడుతున్నందుకు రాజేశ్వరికి సంతోషం కలిగింది.

ఆ క్షణంలో ఎండిపోయిన తన జీవితం తిరిగి చిగురించే అవకాశం కలుగుతుందేమోననే ఆశ ఆమెలో తలెత్తింది...

"వాడిని ఓసారి చూపిస్తావా?" ఆశగా అడిగాడు...

తల వూగించింది...

మరురోజు బాబును తీసుకువచ్చి చూపింది.

వాడు అచ్చం అంతా తల్లిపోలిక.

అప్పటివరకూ ముభావంగా వున్న రాజేశ్వరిలో మార్పు...

ఆమె కళ్ళలో కొత్త కాంతి... వింత వెలుగు...

తను ఆపరేషన్‌కు భయపడుతున్నాడని గ్రహించి తనకు ధయిర్యం చెప్పింది...

ఆపరేషనయింది. నిజంగా అది ఆనందమూర్తికి పునర్జన్మే...

రాత్రి కన్ను మూయకుండా అతనికి సేవ చేసింది... అతను కోలుకున్నాడు...

నేను అదృష్టవంతుణ్ణి రాజేశ్వరీ.... నువ్వే నన్ను దక్కించుకున్నావు"

"మీరు కాదు. నేను... నా అదృష్టం వల్లే మీరు దక్కారు..." నవ్వుతూ అన్నది రాజేశ్వరి...

"ఎప్పుడు డిశ్చార్జ్ చేస్తారు?"

"అప్పుడే. అంత తొందరా... నాకళ్లముందు నుంచి మళ్ళీ పారిపోదామనే..."

నవ్వేడతను...

"ఈసారి మిమ్మల్ని వెళ్ళనీయను"

"ఇది నాకు నరకమే అయినా దేవతలా నువ్వుండబట్టి ఇన్నాళ్ళూ వుండగలిగాను"

రాజేశ్వరికి గుండెలో పూలు పూసినట్లు అనిపించింది...

ఇన్నాళ్ళకు తన జీవితం చిగురించింది... చీకటి మయమయిన తన బతుకు వెలుగు మయం కాబోతోంది...

"రేపు మిమ్మల్ని డిశ్చార్జి చేస్తారట కదా!" క్రితం రాత్రి అడిగింది రాజేశ్వరి. వరండాలో నిలబడి అతనికి దగ్గరగా...

"అవును..." అన్నాడతను సిగరెట్ వెలిగించుకోబోతూ...

"ఎన్నిసార్లు చెప్పాలి మీకు సిగరెట్టు కాల్చవద్దని" కసురుకుంది రాజేశ్వరి.

"మరచిపోయావా రాజేశ్వరీ... ఆ రోజుల్లో నేను సిగరెట్లు కాల్చటం నీకు సరదా... నేను సిగరెట్టు పెదవుల మధ్య పెట్టుకుంటే నువ్వు అగ్గిపుల్ల గీసి ముట్టించేదానివి.... గుర్తు లేదూ"

ఆరోజులు... ఆ అమృతతుల్యమయిన క్షణాలు గుర్తుకొచ్చి పులకించిపోయింది రాజేశ్వరి...

"ఇప్పుడు మీ ఆరోగ్యం అప్పటిలా లేదు... అందుకే సిగరెట్లు మానెయ్యండి. ఇంతకూ రేపు నేను డ్యూటీకి వచ్చేవరకూ వుంటారా?" అడిగింది రాజేశ్వరి.

"నువ్వు రాకుండా వెళ్ళగలనా రాజేశ్వరీ"

రాజేశ్వరి రావడానికి ఇంకో గంట టైముంది...

వాచీకేసి చూసుకున్నాడు ఆనందమూర్తి.

ఆరుగంటలు కావస్తోంది...

ఏదో అర్జంటు కేసు చూట్టానికి వార్డులోకి వచ్చాడు డాక్టర్ అమర్‌నాథ్.

"ఇక మీరు వెళ్ళొచ్చు... సిస్టర్‌తో ఉదయమే చెప్పాను..."

"థాంక్యూ డాక్టర్"

"నో మెన్షన్... అప్పుడప్పుడు కనిపిస్తూ వుండండి"

"అలాగే"

వెళ్ళిపోయాడు డాక్టర్ ముందుకు...

బ్యాగ్‌లోకి అన్నీ సర్దుకున్నాడు అతను.

ఇంతలో కళ్ళకు పెద్ద పెద్ద గ్లాసెస్ పెట్టుకుని లోపలకు వచ్చింది ఓ అమ్మాయి.

ఎర్రగా, లావుగా– పొడుగ్గా వుంది... భుజానికి వేళ్ళాడుతున్నలెదర్ బ్యాగ్, కుడిచేతికి

వాచీ...

"హల్లో... మూర్తీ... సరిగ్గా టైముకు వచ్చాననుకుంటాను... నీ ఉత్తరం ఈ రోజు మధ్యాహ్నం అందింది..." అతని దగ్గరకు వచ్చింది ఆ అమ్మాయి...

బలహీనంగా నవ్వేడతను...

"బాగా వీక్‌గా కనిపిస్తున్నావ్... ఎప్పట్నించో రావాలని ప్రయత్నిస్తున్నాను... కుదరటం లేదు.. ఇడియట్. మా బాస్ ఒక్కరోజు కూడా లీవ్ ఇవ్వలేదు..."

మాట్లాడలేదతను... ఫ్యానుగాలికి ఎగురుతున్న ఆమె ముంగురులను చూస్తూన్నాడతను...

"ఏమిటీ వెయిటింగ్...?"

"రాజేశ్వరి కోసం"

"రాజేశ్వరి ఎవరు?"

"ఇక్కడి నైట్ డ్యూటీ నర్స్...'

"యూ సిల్లీ... ఓనర్స్ కోసమా వెయిటింగ్... ఏమో అనుకున్నాను... ఈనెలరోజులూ వేస్టు కానివ్వలేదన్నమాట... బయల్దేరు..." నవ్వుతూ అతన్ని తొందర పెట్టింది.

అతను మౌనంగా ముందుకు కదిలాడు.

ఇద్దరూ బయటకు వచ్చారు...

రాగానే ఖాళీగా పోతున్న టాక్సీని ఆపింది ఆమె...

తనే డోర్ తెరిచింది...

కారు ప్రక్కనే అప్పుడే ఓ రిక్షా వచ్చి ఆగింది... అందులో నించి దిగింది రాజేశ్వరి...

ఆమెను చూశాడతను... రాజేశ్వరి.

వాళ్ళిద్దర్నీ చూసింది... అతను ఆగిపోయాడు...

"వూ... ఎక్కు మూర్తీ... డోంట్ వేస్ట్ దటైమ్..." తొందర చేసిందామె...

లోపలకు ఎక్కాడతను... తర్వాత ఆమె. కదిలింది టాక్సీ... వెనక్కి తిరిగి చూడాలనుకున్నాడు తను... ధయిర్యం చాల్లేదు.. ఒకవేళ అతను వెనక్కి తిరిగి చూస్తే రిక్షా దగ్గరే కుప్ప కూలిపోయిన రాజేశ్వరి కనిపించేది.

(జనవరి 1979 స్నేహ మాసపత్రికలో ప్రచురితం)